"ప్రేమ ఇచ్చేవాడు కారణం తెలుసుకొని యిస్తాడా? అవ్యాజప్రేమ అంటూ వుండదా?" అని అడిగింది సుందరి.

దురదృష్టవశాత్తూ సుశీలకి ప్రేమలో అసలే విశ్వాసం లేదు. ఎప్పుడన్నా ప్రేమ గురించి మాట్లాడితే, "సెంటిమెంటల్ స్టఫ్!" అనేది.

"మరి నువు నన్నెందుకు ప్రేమిస్తున్నావు?" అని ఎగతాళి చేసేవాణ్ని.

"నాన్సెన్స్! నే నెవరినీ ప్రేమించటంలేదు. నిన్నూ ప్రేమించటంలేదు. నిన్ను చూస్తే ఇష్టంగావుంది. చాలామందిని చూస్తేనూ యిష్టంగా ఉంది" అనేది సుశీల.

"అది అబద్ధం. నువు నన్నే ప్రేమిస్తున్నావు. నన్ను పెళ్ళిచేసుకోకపోతే నువు 'మిజరబుల్' అయిపోతావు. నీ మనసులో ఉన్న అందమంతా అడవిన కాసిన వెన్నెల అయిపోతుంది" అన్నాను.

మీ మొగవాళ్ళెంత అహంకారులు! ... నే నెవరిని పెళ్ళిచేసుకుని అయినా మమారుగా సుఖపడగలను. నాసుఖం సృష్టించుకునే శక్తి నా మనస్సులో ఉంది" అన్నది సుశీల.

"మీ చెల్లెలు తన సుఖమంతా బయటనే ఉందనీ, ఏదోవిధంగా తన కందుతుందనీ అనుకుంటున్నది. నువ్వేమో అంతా నీ మనసులో ఉందను కుంటున్నావు ఏది నిజం?" అన్నాను.

"నే నేం చెప్పగలను? నేననుకునేది నాకు నిజం" అన్నది సుశీల.

సుశీలా సుందరీ నాకు దూరంగా బంధువులు. దగ్గిరగా స్నేహితులు. వాళ్ళింట్లో రోజు కెన్నిగంటలు గడపటానికైనా నా కధికారం ఉంది. నాకు పెళ్ళికాలేదు, వాళ్ళకీ పెళ్ళిళ్ళు కాలేదు. నేనా ఇద్దర్లో ఎవరిని పెళ్ళాడుతానన్నా ఇంట్లోవున్న పై వాళ్ళెవరూ పేచీపెట్టరు. ఈ ఇద్దర్నీ కాక మరో పరాయి పిల్లను చేసుకుంటే గుండెపగిలి బాధపడే వారెవరూ లేనిమాట నిజమే మరి. ఇదీ ఉన్న పరిస్థితి.

ఈ స్థితిలో లక్ష్మీకాంతం వచ్చి మామధ్య పడ్డాడు. లక్ష్మీకాంతం ఎవరి మొదటి దృష్టినైనా బలంగా ఆకర్షించగలవాడు. అతను చూడటానికి సినిమాస్టారు మోస్తరుగా ఉంటాడు. సినిమాల్లో పాటలన్నీ జయప్రదంగా పాడతాడు. ఆధునిక కవిత్వం గంటలకొద్దీ అప్పగించగలడు. సరదాగా మాట్లాడతాడు. సినిమాతారలందర్నీ ఇంటర్వ్యూ చేసినట్టు కనిపిస్తాడు. ఆధునిక రచయిత లందరితోను అంతో ఇంతో పరిచయం ఉన్నట్టు కనిపిస్తాడు. టెన్నిస్, పింగ్‌పాంగ్ మొదలైన ఆటలాడుతాడు. చాలా డబ్బున్నది. మామూలుగా ఈ అక్క చెల్లెళ్ళచుట్టూ పరిభ్రమించే శలభాలకీ ఈ గొల్లభామకీ

